క్లుప్తంగా

వీధికుక్కలకు చర్మవ్యాధి



తిర్యాణి: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో వీధి కుక్కలకు చర్మవ్యాధి బారినపడుతున్నాయి. ఇది మనుషులకు సోకే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అధికారులు వెంటనే కుక్కలను వేరే ప్రాంతాలకు తరలించాలని మండలవాసులు కోరుతున్నారు.

అశోక్‌కుమార్‌కు గెజిటెడ్ లెక్చరర్ల సంఘం మద్దతు

ఆసిఫాబాద్అర్బన్: కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వై.అశోక్‌కుమార్‌కు మద్దతు ప్రకటించినట్లు గెజిటెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 36 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా అనుభవం ఉన్న వ్యక్తి అశోక్‌కుమార్ అని అన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకుడిగా టీచర్ల అనేక సమస్యలు పరిష్కరించిన నేపథ్యంలో మద్దతు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

ఆలయ నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

కౌటాల: మండలం తాటిపల్లి గ్రామ వార్ధానది ఒడ్డున గల శ్రీ శివసిద్ధి హనుమాన్ ఆలయ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్ములే దత్తు, గౌరవ అధ్యక్షుడిగా బొమ్మకంటి మహేశ్, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్, ఎల్ములే మారుతి, కోశాధికారులుగా బడగే సంతోష్, పి.దివాకర్, సహాయ కార్యదర్శులుగా టి.విశ్వనాథ్, జి.బాపూజీ, ముఖ్య సలహాదారుగా జి.చంపత్, రోహినే సంతోష్, బాలాజీ ఎన్నికయ్యారు. ఈనెల 28న ఆలయంలో జరిగే మహాశివరాత్రి జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తామని వారు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు. ముందస్తు సమాచారంతో గ్రామంలో తనిఖీలు నిర్వహించగా డోకె రుషి ఇంట్లో 6 సంచుల్లో 3 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభించినట్లు ఎస్సై పేర్కొన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'హామీల అమలులో ఎమ్మెల్యే విఫలం'



మాట్లాడుతున్న నాయకులు

భీమారం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ విఫలమయ్యారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ప్రచురించిన క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. జైపూర్‌లోని పవర్ ప్లాంట్‌లో 20వేల మంది స్థానికులకు ఉపాధి కల్పిస్తానని వివేక్ హామీ ఇచ్చినా, ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఉద్యోగం ఇవ్వలేదని, భీమారంలో గ్రౌండ్ పేరుతో కాంగ్రెస్ నాయకులు మొరం అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు దాసరి మధునయ్య, మణిదీప్, నరహరి, ప్రణీత్ గౌడ్, సాగర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి బయల్దేరిన ఎల్‌ఐసీ ఏజెంట్లు

పాతమంచిర్యాల: ఎల్‌ఐసీ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 11న ఢిల్లీలోని పార్లమెంట్ ఎదుట జరిగే మహాధర్నాకు జిల్లా నుంచి ఎల్‌ఐసీ ఏజెంట్‌లు ఆదివారం తరలివెళ్లారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎల్‌ఐసీ ఏజెంట్‌ల ప్రయోజనాలను పరిరక్షించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ మంచిర్యాల బ్రాంచ్ బాధ్యులు తిరుపతి, మహేష్, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య.స్వామి, వేణు, ఆశీర్‌విల్సన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణతో మెరుగుబడి

- సర్కారు బడుల్లో చర్యలు
- విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పెంపునకు కృషి
- తోడ్పడుతున్న టీఎల్‌ఎంలు



చాపన్‌గూడలో చదువుతున్న విద్యార్థిని



విద్యార్థిని బోధనను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కెరమెరి: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రతీ మండల ఎంఈవో వారంలో మూడు పాఠశాలలను సందర్శించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. స్థానిక ఎంఈవో ఆడే ప్రకాశ్‌తోపాటు కెరమెరి, ఝరి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ప్రతీరోజు మండలంలోని ప్రభుత్వ బడులను పర్యవేక్షిస్తున్నారు. ఎఫ్‌ఎల్‌ఎస్, రూం టు రీడ్, లైబ్రరీ రీడింగ్ తదితర కార్యక్రమాలతో విద్యార్థులు నైపుణ్యాలను సాధించగలుగుతున్నారు. మండలంలోని 31 పంచాయతీల్లో మూడు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండగా లోకల్ బాడీ పాఠశాలలు 56 ఉన్నాయి. వాటిలో ఉన్నత పాఠశాలలు 3, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ప్రాథమిక పాఠశాలలు 48 ఉన్నాయి. 3213 మంది విద్యనభ్యసిస్తున్నారు.

బోధన సామర్థ్యాలు మెరుగు

టీఎల్‌ఎం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. టీఎల్‌ఎం ద్వారా బోధనలతో విద్యార్థులు అభ్యాసన సామర్థ్యాలు పెంపునకు కృషి చేస్తున్నారు. నూతన, వినూత్న విధానాలతో సృజనాత్మకతతో టీఎల్‌ఎంలను తయారుచేసి విద్యార్థులకు చెబుతున్నారు. దీంతో ఆ క్రియల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 40 నుంచి 50 మంది విద్యార్థులు చదవడం, రాయడం, చతుర్విధ ప్రక్రియల్లో కూడికలు, తీసివేతలు, గుణకారాలు చేయగలుగుతున్నారు. అనేక పాఠశాలల్లో రంగురంగుల బొమ్మలు గీయడంతో బడులు ఇట్టే ఆకట్టుకంటున్నాయి.

తనిఖీలు, పర్యవేక్షణలు

రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారుల నుంచి మండల అధికారుల వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలు కొనసాగుతున్నాయి. పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలతో ఉపాధ్యాయులు అలర్ట్ అవుతున్నారు. ప్రతీ అధికారి విద్యార్థులతో పుస్తకాలు చదవించడం, చతుర్విద ప్రక్రియలు చేయిస్తున్నారు. తరగతి బోధనను పరిశీలిస్తున్నారు. సలహాలు సూచనలు ఇస్తున్నారు. అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. ఉపాధ్యాయులు ముందుగానే ప్రిపేర్ అయి పాఠశాలలకు వచ్చి బోధన చేస్తున్నారు. తరగతులు, పాఠ్యాంశాల వారీగా బోధన చేస్తుండడంతో విద్యాబోధన మెరుగుపడుతుంది.

మరింత మెరుగుపడాలి



గతం కంటే ఇప్పుడు పాఠశాలలు ఎంతో మెరుగుపడుతున్నాయి. విద్యార్థులకు పదాలు, వ్యాక్యాలు చదవగలుగుతున్నారు. చతుర్విద ప్రక్రియలు చేయగలుగుతున్నారు. బడులు మరింత మెరుగుపడాలి. బడులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

సింగరేణిని సంరక్షించుకోవాలి

- సేవ్ సింగరేణి పేరుతో ఉద్యమం
- గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సంస్థ ప్రమాదపుటంచుల్లో ఉందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం మాట్లాడారు. ఐదేళ్ల క్రితం సంస్థ ఉన్న పరిస్థితులు, నేటి పరిస్థితులను చూస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా తయారైందన్నారు. సంస్థ కార్యకలాపాలను నిర్వహించడంలో కీలకంగా ఉండే డైరెక్టర్ పోస్టులను కూడా భర్తీ చేయడం లేదన్నారు. నాలుగు డైరెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. డైరెక్టర్ (పా) వంటి కీలక పోస్టును కూడా ఇన్‌చార్జీతో నడిపిస్తున్నారన్నారు. సంస్థలో సేఫ్టీ పరికరాలు కొనడానికి కూడా నిధులు లేవన్నారు. ఉద్యోగుల జీతాలకు కూడా డబ్బులు ఉండటం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.23 వేల కోట్లు బకాయిలను పెడితే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రూ. 32 వేల కోట్లకు పెంచిందని తెలిపారు. సంస్థకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో నిధుల కొరత ఏర్పడిందన్నారు. కార్మికులకు చికిత్సలు అందిస్తున్న సింగరేణి నెట్వర్క్ కార్పొరేట్ ఆస్పత్రులకు మెడికల్ బిల్లులు చెల్లించకపోవడంతో వారు కార్మికులకు వైద్యం చేయడానికి నిరాకరిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లకు సైతం డబ్బులు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మరో పక్క కోల్ ఇండియా నుంచి తక్కువ ధరకే మార్కెట్‌లో బొగ్గు లభించడంతో సంస్థ తీవ్ర పోటీ ఎదుర్కొంటోందని తెలిపారు. స్ట్రక్చరల్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను కూడా యజమాన్యం అమలు చేయడం లేదని వెల్లడించారు. కోయగూడెం, సత్తుపల్లి, తాడిచర్ల బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు 13 ఏళ్లుగా వేతనాలు పెరగలేదని సత్వరమే వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సింగరేణిని రక్షించే చర్యను ప్రభుత్వం చేపట్టడం లేదన్నారు. మరోపక్క రాజకీయ జోక్యం మితిమీరిందన్నారు. ఈ పరిస్థితుల్లో సింగరేణిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. దీనికోసం ప్రభుత్వ పెద్దలను కలిసి వినతిపత్రాలు ఇస్తామని వారు స్పందించకుంటే కార్మికులు, అన్ని కార్మిక సంఘాలతో కలిసి సేవ్ సింగరేణి పేరుతో ఉద్యమిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదా, సహాయ కార్యదర్శి కొమురయ్య, నాయకులు ప్రసాద్‌రెడ్డి, నాగభూషణం, రామచందర్, నెరవేట్ల మల్లేశ్, మురళిచౌదరి, సదానందం, నగేష్, అఫ్రోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

వాంకిడి: సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రశాంత్ అన్నారు. మండలంలోని కనర్‌గాం, వాంకిడి, ఖమాన గ్రామాల్లో ప్రజలకు ఆదివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు మహిళా కానిస్టేబుళ్లు సుమలత, వినోద, రోషిణి వివరించారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎవరైనా ఫోన్లు చేసి బెదిరింపులకు గురి చేసినా, బ్యాంకు ఖాతా నంబర్లు అడిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. భయం వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో నీటి కొరత

- తీవ్ర ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- బకెట్లు పట్టుకొని బయటకు..
- ఎట్టించుకోని అధికారులు



నీటి కోసం బయటకు వెళ్లిన విద్యార్థులు

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. గిరిజన విద్యార్థుల తలరాత మారడం లేదు. మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో మొత్తం 100 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలో నీటి సౌకర్యం లేకపోవడంతో ప్రతీరోజు ఉదయం కాలకత్యాలతో పాటు స్నానాలు చేసేందుకు తాహసీల్దార్ కార్యాలయ సమీపంలోని చేతి పంపు వద్ద పడిగాపులు కాయాల్సి దుస్థితి. చేతి పంపు వద్ద అరుబయటే స్నానాలు, ముఖాలు కడుక్కుంటున్నారు. పాఠశాలలో వాటర్ ట్యాంకు ఉన్నా.. ఉపయోగం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరగంట మాత్రమే నీరు సరఫరా అవుతుందని వాపోతున్నారు. ఈ సమస్యలను ఐటీడీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి ఫలితం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సౌకర్యం సరిగా లేకపోవడంతో మరుగు దొడ్లు నిరుపయోగంగా మారాయి.

అరగంట మాత్రమే..

నార్నూర్, తాడిహత్నూర్, భీంపూర్ గ్రామాల్లోని ఆశ్రమ పాఠశాలలో నీటి కొరత తీవ్రంగా ఉంది. పాఠశాలలో విద్యార్థులు మిషన్ భగీరథ నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. భగీరథ నీరు రాని రోజు నీళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మిషన్ భగీరథ నీటిని అరగంట కంటే ఎక్కువ సరఫరా కావడం లేదు. విద్యార్థులు పాఠశాల ఆవరణం నుంచి బయటకు వచ్చి స్నానాలు, ముఖాలు కడుకోవాల్సి పరిస్థితి. నీటి కోసం బయటకు వస్తున్న విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

నార్నూర్ మండల కేంద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో నీటి సమస్య ఉన్న విషయం నా దృష్టికి వచ్చింది. మిషన్ భగీరథ నీటిపై ఆధారపడాల్సి ఉంది. నీటి సమస్యను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తాం. పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

– క్రాంతికూమార్, ఏటీడీవో ఉట్నూర్

పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్

- మార్కెట్‌లో రూ.8 వేల నుంచి లభ్యం
- కొనుగోలుకు రైతుల ఆసక్తి



పంట చేనులో ఏర్పాటు చేసిన సోలార్

పెంచికల్‌పేట్: అడవి జంతువులు, పశువుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు సోలార్ కంచె వినియోగిస్తున్నారు. గతంలో పంటలు కాపాడుకోవటానికి రాత్రి పగలనక కాపలా ఉండేవారు. సోలార్ కంచెతో అడవి జంతువులకు, మనుషులకు ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో వీటి వినియోగం పెరిగింది. మండలంలోని మురళీగూడ, జిల్లెడ, నందిగామ, కమ్మర్‌గాం, గుండెపల్లి, అగర్‌గూడ, కొండపల్లి, కోయచిచ్చాల, ఎల్లూర్, బొంబాయిగూడ, లోడుపల్లి గ్రామాలు అటవీ సమీపంలో ఉన్నాయి. రైతులు సాగు చేస్తున్న వరి, కంది, శనగ, మొక్కజొన్న, ఇతర పంటలు నిత్యం అడవి పందులు, వన్యప్రాణులు, కోతుల దాడుల్లో దెబ్బతింటున్నాయి. దీంతో పంటలు కాపాడుకోవటానికి రైతులు సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్నారు. తక్కువ ఖర్చుతో రెండెకరాల నుంచి 20 ఎకరాలు సాగు చేస్తున్న రైతులు సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్‌లో రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకు లభిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు అన్నదాతలు ఆసక్తిచూపుతున్నారు. కర్రలు, జీఏవైర్, ఇన్సులేటర్, సోలార్ ప్యానెల్, బ్యాటరీ వినియోగించి చేల చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్నారు. కంచెకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యే వెసులుబాటు ఉండటంతో రైతులు పగలు, రాత్రి పంటలకు కంచె ఏర్పాటు చేస్తున్నారు. బ్యాటరీ నుంచి వచ్చే డీసీ విద్యుత్‌తో జంతువులు కంచెను తగిలితే స్వల్పంగా షాక్ తగులుతుండటంతో వన్యప్రాణులు బెదిరిపోతున్నాయి. సోలార్ కంచెతో వన్యప్రాణులకు ఎలాంటి ప్రమాదాలు లేకపోవడంతో రైతులు సోలార్ కంచె ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు.

కాపలా అవసరం లేదు



మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రూ.12 వేల పెట్టుబడితో చేల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేశా. 24 గంటలు కంచెకు విద్యుత్ సరఫరా ఉంటుంది. కంచెకు జంతువులు తగిలితే షాక్‌కు గురై బెదిరిపోతున్నాయి. గతంలో రాత్రి, పగలు పంటలకు కాపలా ఉండాల్సిన అవసరం లేదు. సోలార్ కంచెతో ఎంతో మేలు చేకూరుతుంది.

– ఇలియాస్, రైతు, ఎల్లూర్

భారంగా 'నిర్వహణ'

- రైతు వేదికలకు నిలిచిన నిర్వహణ నిధులు
- ఏఈవోలపై భారం
- రూ.లక్షల్లో పేరుకుపోయిన బకాయిలు



రెబ్బెన రైతువేదిక

రెబ్బెన: పంటల సాగులో రైతులకు విస్తృతంగా సేవలందించేందుకు నిర్మించిన రైతు వేదిక నిర్వహణ వ్యవసాయశాఖ అధికారులకు భారంగా మారుతోంది. ప్రతీవారం రైతునేస్తం కార్యక్రమాల నిర్వహణతోపాటు పంటల సాగులో ఏర్పాటు చేసే అవగాహన సదస్సులు, ఇతర ప్రభుత్వ పథకాలను రైతులకు చేరవేర్చేందుకు నిర్వహించే కార్యక్రమాల భారమంతా వ్యవసాయశాఖ అధికారుల పైనే పడుతోంది. ప్రభుత్వం రైతు వేదికల నిర్వహణకు నిధులు విడుదల చేయకపోవడంతో ఏఈవోలే సొంత డబ్బులను ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం నుంచి ఏళ్ల తరబడి నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో విద్యుత్ బిల్లులు వేలల్లో పేరుకుపోతున్నాయి. ఫలితంగా రైతుల కోసం నిర్వహించే కార్యక్రమాలను సైతం పూర్తిస్థాయిలో చేపట్టలేకపోతున్నారు.

రూ.లక్షల్లో బకాయిలు

మండలంలో 24 పంచాయతీలు ఉండగా నాలుగు క్లస్టర్ల పరిధిలో ప్రభుత్వం నాలుగు రైతువేదికలను ఏర్పాటు చేసింది. రెబ్బెన, నారాయణపూర్, తక్కళ్లపల్లి, కైరిగాంలలో వేదికలను నిర్మించింది. అయితే గతంలో ప్రభుత్వం రైతువేదికల నిర్వహణ కోసం నెలకు రూ.9 వేలు విడుదల చేయగా రెండేళ్లుగా నిధులు ఆగిపోయాయి. దాంతో నిర్వహణ భారమంతా ప్రస్తుతం ఏఈవోలే భరించాల్సి వస్తోంది. స్వీపర్, కరెంట్ బిల్లులు, తాగునీటి ఖర్చులు ఇలా ఒక్కో రైతు వేదికకు నెలకు రూ.6500 వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. గత 29 నెలలుగా నిర్వహణ నిధులు పేరిట ఒక్క రూపాయి విడుదల చేయకపోవడంతో ఒక్కో రైతువేదికలకు రూ.లక్ష నుంచి 1.5 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. రెబ్బెన రైతు వేదికలో వారానికి నాలుగు రైతునేస్తం కార్యక్రమాల నిర్వహణ, రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ వేదికనే ఎంపిక చేస్తుండటంతో దీనిపై నిర్వహణ భారం అధికంగా మారుతోంది. దాంతో ఒక్కో ఏఈవోకు దాదాపు రూ. 1.5 లక్ష వరకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది.

కనీస సౌకర్యాలు లేవు

ప్రభుత్వం ప్రతీ క్లస్టర్‌లో రైతువేదికలను నిర్మించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు చేపట్టింది. అయితే రైతువేదికల్లో వ్యవసాయ అధికారులు కనీస సౌకర్యాల అందుబాటులో లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతీ వేదికలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉండగా ఏ వేదికలో అందుబాటులో లేవు. మరుగుదొడ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే మిగిలిపోవడంతోపాటు మహిళా ఏఈవోలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఎటు వెళ్లాలో తెలియక ఊపిరి బిగపట్టుకుని ఉండాల్సిన దయనీయ పరిస్థితిలో విధులు నిర్వహిస్తున్నారు. కనీసం తాగునీటి సౌకర్యం కూడా అందుబాటులో లేక బయట నుంచి నీటిని కొనుగోలు చేసుకుని దాహార్తిని తీర్చుకోవాల్సి వస్తోంది.

రూ.1.5 లక్షల వరకు బిల్లు రావాల్సి ఉంది

రైతువేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. రైతువేదికల్లో జరిగే కార్యక్రమాల నిర్వహణ భారంతోపాటు విద్యుత్, తాగునీటి బిల్లులు, స్వీపర్ ఖర్చులకు సొంతంగా డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది. నాకు ఇప్పటి వరకు దాదాపు రూ.1.5 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. నిర్వహణ నిధుల విడుదలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదు.

– రాకేశ్, ఏఈవో

ఆలయంలో సందడి



గుహలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి హారతి తీసుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయం ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గుహలో పవళింపు ఆకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

పనుల ప్రారంభమెప్పుడు?



ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని అప్పపల్లి గ్రామానికి వెళ్లే వాగుపై వంతెన నిర్మాణానికి గతేడాది మే నెలలో రూ.1.86 కోట్లతో పనులు ప్రారంభించారు. పనులు పునాది దశలో ఉన్నాయి. వర్షాకాలం మొదలు కావడంతో పనులు వదిలేశారు. వెంటనే పనులను ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ ప్రాంతీయ సదస్సు



పురస్కారాలతో లయన్స్ క్లబ్ సభ్యులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 2024–25 ప్రాంతీయ సదస్సు(రీజియన్ మీట్) నిర్వహించారు. ఈ సందర్భంగా జూలై నుంచి జనవరి వరకు లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను బెస్ట్ లయన్స్ క్లబ్‌గా మంచిర్యాల లయన్స్ క్లబ్, బెస్ట్ ప్రెసిడెంట్‌గా లయన్ బాలమోహన్, బెస్ట్ యాక్టివిస్ట్‌గా మధుసూదన్‌రెడ్డి, బెస్ట్ ట్రెజరర్‌గా వెంకటేశ్వర్‌రావుకు వివిధ సేవా రంగాల్లో సేవలందించిన సభ్యులకు వ్యక్తిగత అవార్డులు లభించాయని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాలమోహన్ తెలిపారు. ఇకపై జిల్లా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, రక్తదాన, కంటి శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహించనున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, బాలమోహన్, కారుకూరీ చంద్రమౌళి, వినయ్‌కుమార్, డా.సుగుణాకర్‌రెడ్డి, సూర్యనారాయణ, గుండా శ్రీనివాస్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.